# నిదురించే తోటలోకి

పొద్దున ఎనిమిదన్నర వేళలో... కూతురు రాధను వెంటపెట్టుకుని, భీమవరం స్టేషన్లో రైలు దిగేడు బలరామయ్య... 'పోర్టరు'ని పిలిచి, సూట్‌కేసూ - సంచీలూ అతనికి అందించి, స్టేషన్లోంచి బయటకు వచ్చాడు... ఇక అక్కణ్ణించి బల్లిపాడు వెళ్లాలి!

టాక్సీ ఎక్కివెళ్లే స్తోమత బలరామయ్యకు లేకపోయినా - నెలలు నిండుతున్న తరుణంలో - తొలికాన్పుకి వచ్చిన కూతుర్ని సుఖంగా ఇంటికి తీసుకెళ్లే ఉద్దేశ్యంతో 'బల్లిపాడు'కి టాక్సీ మాట్లాడేడు...

మరో గంటకల్లా... టాక్సీ బలరామయ్య ఇంటి ముందు ఆగింది... అంతవరకూ వాళ్ల రాకకోసమే ఎదురుచూస్తున్న సుందరమ్మ, కారాగిన శబ్దం విని, హారతి పళ్లెంతో గుమ్మం దగ్గరకొచ్చింది... కూతురుకి దిష్టి తీసి, హారతిచ్చి లోపలకు తీసుకెళ్లింది... 'బావున్నావా తల్లీ?' అంటూ ఆపాదమస్తకం ఆమెను తృప్తిగా చూసి గుండెలకు హత్తుకుంది... బుగ్గలు తడిమి ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది..

"ముద్దులూ, మురిపాలూ మూటకట్టి ఉంచు! అమ్మాయి మూణ్ణెల్లుంటుంది... తీరుబడిగా తీర్చుకోవచ్చు... ముందు దానికి వేడిగా పాలు తీసుకురా!... పొద్దున్నించీ కాఫీ కూడా తాగలేదు!" అంటూ బలరామయ్య సున్నితంగా మందలించటంతో సుందరమ్మ వంటగదిలోకి నడిచింది.

"కాసేపు ఇలా కూర్చోరానాన్నా" అంటూ కూతురి దగ్గరకు కుర్చీని లాగేడు బలరామయ్య. 'రాధ' ఒక్కతే తమకు సంతానం కావటంతో, ఆమెను ఎంతో అపురూపంగా పెంచి పెద్ద చేశారు...

రాధ తన చేతిలో ఉన్న 'బ్యాగ్' బల్ల మీద పెట్టి కూర్చుంటూండగా... ఆ బ్యాగ్‌లో ఉన్న 'సెల్‌ఫోన్'లో 'మెసేజ్' ఏదో వచ్చిన శబ్దం వినిపించింది... 'బహుశా ఆయనే అయ్యుంటారు' అనుకుంటూ, సెల్‌ఫోన్ తీసి చూసింది.... తను ఊహించినట్టే... భర్తనించి 'మెసేజ్' వచ్చింది.

"క్షేమంగా చేరేరనుకుంటాను... నిన్ను బాగా మిస్సవుతున్నాను రాధీ!... రాత్రంతా నిద్రపట్టలేదు... మూడు నెలలు ఎలా గడపాలో!?"

ఆ 'మెసేజ్' చదువుకున్న రాధ కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగేయి... 'నిజమే! మూడు నెలలు... ఆ విరహాన్ని భరించటం తనకూ కష్టమే!' అనుకుందామె. తాను క్షేమంగా ఇంటికి చేరిన వైనాన్ని భర్తకు 'మెసేజ్' పంపించింది.

ఇంతలో, సుందరమ్మ గ్లాసుతో పాలు తెచ్చి రాధకు ఇచ్చింది... పొద్దెక్కితే ఊళ్లో ఉన్న గుడి మూసేస్తారన్న తొందరలో... వాటిని గబగబా తాగేసి, చన్నీళ్ళ స్నానం చేసి, పట్టుచీర కట్టుకుని, పక్కింటి స్నేహితురాల్ని వెంటబెట్టుకుని గుడికి చేరుకుంది రాధ...

ప్రాంగణంలో అడుగు పెట్టగానే, పూజారి కేశవయ్య ఎదురయ్యాడు... "రామ్మా! నీ కోసమే ఎదురు చూస్తున్నా... ఇవాళ నిన్ను హైదరాబాదు నించి తీసుకొస్తున్న విషయం మీ నాన్న చెప్పాడు... ఊళ్లో అడుగు పెట్టిన వెంటనే నువ్వు గుడికి రాకుండా వుండలేవని నాకు తెలుసు!... నీ కోసం మన మదనగోపాలస్వామి కూడా ఎదురు చూస్తున్నాడు... పెళ్లి చేసుకుని కాపురానికి వెళ్లే వరకూ, ప్రతిరోజూ చీకటితోనే వచ్చి, తోటలో పొగడపూల చెట్టు కింద రాలిన పువ్వులన్నీ ఏరి, మాల గుచ్చి స్వామికి అలంకరించేదానివి... ఇప్పుడు అలా దండ గుచ్చి వేసే ఆడపిల్లలే కరువై పోయారు మనూళ్లో...! పోన్లే... నీ భక్తికి మెచ్చి, స్వామి నీకు బంగారం లాంటి భర్తనిచ్చాడు... త్వరలోనే 'బాలకృష్ణుడి' లాంటి బిడ్డను కూడా ప్రసాదిస్తాడు... మొక్కుకో!" అంటూ ఆత్మీయంగా ఆహ్వానించి, గర్భగుడిలోకి ఆమెను తీసుకెళ్లాడు...

దాదాపు పాతికేళ్ళ పాటు పూజించిన తన ఊరి దేవుణ్ణి, ఏడాది కాలం తర్వాత చూసేసరికి, ఏదో బెంగ తీరినట్టయి, అదోరకమైన పులకింతకు లోనయిందామె. కళ్లలోంచి ఆనందభాష్పాలు జలజలా చెంపల మీదకు జాలువారుతూంటే పైట చెంగుతో తుడుచుకుంది... ఇంతలో, ఆమె పేరు మీద అర్చన చేసి, హారతిచ్చి ఆమెకు ఇష్టమైన 'అన్న ప్రసాదాల్ని' కుట్టుడాకు డొప్పల్లో వుంచి అందించాడు కేశవయ్య...

గుడిలోంచి బయటకు వచ్చి, మండపం మెట్టు మీద కూర్చుంది రాధ...!... ఆమె ఆ ఊరు వదిలి వెళ్లిన ఏడాది కాలంలో... ఊళ్లోనూ, గుళ్లోనూ వచ్చిన మార్పులూ చేర్పుల గురించి స్నేహితురాలు ఏమిటేమిటో చెప్తోంది... కానీ ఆ మాటలేవీ ఆమెకు వినిపించటం లేదు... పక్కనే వున్న రావిచెట్టు ఆకుల మధ్యనించి తెరలుతెరలుగా వీస్తున్న చల్లటి గాలుల్ని పరవశంతో ఆస్వాదిస్తోంది... ఆ చెట్టు కొమ్మల మధ్య వున్న పక్షులు చేస్తున్న 'రొద'లో కూడా ఏదో మధురమైన సంగీతమే ఆమెకు వినిపిస్తోంది.

"అప్పుడు కూడా ఇంతే!... సరిగ్గా ఇంతే!"... అనుకుంది రాధ గతంలోకి చూస్తూ... అప్పుడే ఏడాది నిండిపోయిన ఆ గతంలో...

★ ★ ★

ఆరోజు వైకుంఠ ఏకాదశి... రాత్రి ఎనిమిది గంటల వేళ!... మదనగోపాల స్వామి ఆలయం రంగురంగుల విద్యుద్దీపాల తోరణాలతో కాంతివంతంగా కనిపిస్తోంది. గర్భగుడిలోని ప్రమిదల్లో జ్యోతులు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి... ఆ వెలుగుల్లో

స్వామి, మామూలు 'విగ్రహంలాగా' కాకుండా, జీవంతో ఉన్న దేవతామూర్తిలా సాక్షాత్కరిస్తున్నాడు... గర్భగుడికి ఇవతల, విశాలంగా ఉన్న ప్రాంగణంలో ఓ పక్కగా కూర్చుని, దేవస్థాన సంగీతకారులు, సన్నాయి వాయిద్యాల్ని వినిపిస్తున్నారు...

సాయంత్రం ఆరు గంటల నించే ఊళ్లో జనాలు ఒక్కొక్కరే వచ్చి, స్వామిని సేవించి ముడుపులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకుని వెడుతున్నారు... చీకటిపడే వేళకే గుడికి వచ్చిన రాధ, గర్భగుడిలోనే ఉండి, ప్రమిదల్లో నూనె పోస్తూ, వత్తుల్ని ఎగదోస్తూ, భక్తులు అందిస్తున్న పూలమాలల్ని ఉత్సవమూర్తులకు అలంకరిస్తూ చాలాసేపు గడిపింది... భక్తుల రాక తగ్గిపోయాక, తను కూడా ప్రసాదం తీసుకుని బయటకొచ్చి, ఎప్పటిలాగా, మండపం మెట్టుమీద కూర్చుని వేణు రాకకోసం ఎదురు చూస్తోంది...

వేణు, రాధకు సాక్షాత్తూ మేనత్తకొడుకే!.... అయితే 'మేనత్త కొడుకూ ఓ మొగుడేనా?' అని రాధ ఎప్పుడూ అనుకోలేదు... ఆ మాటకొస్తే, అతనే తనకు 'మొగుడై' వస్తే బాగుండునని ఈ మధ్య చాలాసార్లు అనుకుంది. అప్పుడప్పుడు గుళ్లో స్వామిని కూడా కోరుకుంటోంది.

వేణు పుట్టటానికి అయిదు నెలలముందే, అతని తండ్రి, పాముకాటుతో మరణించాడు... పుట్టిన అయిదేళ్లకు అమ్మ కూడా కన్నుమూసింది... అప్పట్నించీ మేనమావ బలరామయ్యే అతన్ని చెరదీసి చదివించాడు... ఆ ఊళ్లో హైస్కూలు చదువయ్యాక, భీమవరం పంపించి, డిగ్రీలో చేర్చాడు... అయితే అతనికి తన కూతుర్నిచ్చి పెళ్లి చేయాలన్న స్వార్థం, ఏకాశానాలేదు... పైగా ఈ మధ్య కాలంలో, రాధకు చాలా సంబంధాలే చూశాడు... అన్నీ కట్నకానుకల విషయంలోనే వెనక్కి వెళ్లిపోయాయి. అప్పటికీ, మేనల్లుణ్ణే, అల్లుడిగా చేసుకోవాలన్న ఆలోచన కలగలేదు..

డిగ్రీ చేతికొచ్చాక వెంటనే ఏదైనా ఉద్యోగంలో చేరి, మేనమామకు సహాయ పడాలన్న కోరిక వేణులో ఎక్కువైంది... ఆ పల్లెటూరిలో ఉంటూ, ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవటం కంటే, హైదరాబాదు వెళ్లి, అవసరమైతే ఏదైనా 'కంప్యూటరు కోర్సు' చేసి మంచి ఉద్యోగం సంపాదించుకోవాలని నిర్ణయించుకున్నాడు... కానీ, అందుకు వేలల్లో డబ్బు అవసరమవుతుంది... దాదాపు ఇరవై ఏళ్లు, తనను దగ్గర ఉంచుకుని పోషించి చదువు చెప్పించిన మేనమామను మరింత ఇబ్బంది పెట్టటం అతనికి ఇష్టం లేకపోయింది... తన తండ్రి నించి సంక్రమించిన ఎకరం నేలనూ అమ్మి, ఆ వచ్చిన డబ్బుతో, తన కాళ్ల మీద తాను నిలబడే వరకూ, అవసరాలు చూసుకోవచ్చు ననుకున్నాడు... ఆ మాటే ఓ రోజు బలరామయ్యకు చెప్పాడు...

అభ్యంతరం చెప్పే అవకాశం బలరామయ్యకు లేకపోయింది. పదిహేను రోజుల వ్యవధిలో ఆ నేల అమ్మేసి, వచ్చిన డబ్బుతో హైదరాబాదు చేరుకున్నాడు వేణు.

తనతోపాటే కాలేజీలో చదువుకున్న ఓ స్నేహితుడి ఆశ్రయంతో, ఒకవైపు అవకాశాల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే, మరోవైపు ఓ 'కంప్యూటర్ కోర్స్' కూడా పూర్తి చేశాడు... ఆ వెంటనే అదృష్టం కలిసొచ్చి, మంచి ఉద్యోగం వచ్చింది... నెలకు ఏభై వేలకు పైగా జీతం...! పైనున్న తల్లితండ్రుల దీవెనలతో పాటు, తనను పైకి తీసుకొచ్చిన మేనమామ మంచితనం, గుళ్లో ఉన్న మదనగోపాలస్వామి ఆశీర్వాదం, అన్నీ వున్నందువల్లనే ఆ అదృష్టం లభించిందనుకున్నాడు వేణు...

ఉద్యోగంలో, మొదటినెల జీతం తీసుకోగానే, రెండు రోజులు శలవులు కలిసొస్తే, బల్లిపాడు వచ్చాడు... వస్తూ ఇంట్లో ముగ్గురికీ కొత్త బట్టలు తెచ్చాడు... అతను అంత ప్రయోజకుడైనందుకు ఇంట్లోవాళ్లతో పాటు ఊళ్లో, తెలిసిన వాళ్లు కూడా చాలా సంతోషించారు...

తిరుగుప్రయాణానికి ముందురోజు సాయంత్రం, గుళ్లో దేవుణ్ణి దర్శించుకునేందుకు బయల్దేరాడు వేణు... దారిలో స్నేహితులు కనిపిస్తే... వాళ్లతో ఊరి చివరి పొలం వైపు వెళ్లి, కాసేపు కబుర్లు చెప్పుకున్నాక, గుడికి చేరుకున్నాడు... లోపలకు వెళ్లి స్వామిని అర్చించుకుని, బయటకు వస్తూ, మండపం మెట్ల మీద కూర్చున్న రాధను చూశాడు...

"ఇంటికెడదామా?" పక్కనే కూర్చుని ప్రసాదం తింటూ అడిగాడు...

'వెడదా'మన్నట్టు తల ఊపి, లేవబోయింది రాధ... వెంటనే ఆమె చేయి పట్టుకుని కూర్చోబెట్టి... "అయిదు నిమిషాలు కూర్చుని వెడదాంలే!" అన్నాడు మళ్లీ... రాధ తన పైటను భుజాల మీదుగా లాక్కుని, కుదురుగా కూర్చుంది...

"నేను రేపు హైదరాబాదు వెళ్లిపోతున్నాను... తెలుసా?" అడిగాడు.

"ఊ!" తెలుసునన్నట్టు చెప్పింది.

"హైదరాబాదు చాలా బావుంది!... నా ఉద్యోగం ఇంకా బాగుంది... ఏభై వేల జీతం" చెప్పాడు వేణు... ఆ విషయాలన్నీ అంతకుముందే ఆమెకు తెలిశాయి... ప్రత్యేకించి, వేణు మళ్లీ తనకెందుకు చెప్తున్నాడో అర్థం కాలేదామెకు... కానీ, ఎందుకో ఇదివరకెప్పుడూ లేని సిగ్గు, ఇపుడలా అతని పక్కనే కూర్చుని, అతని మాటలు వింటూంటే - ఆమెను ముంచెత్తుతోంది... ఓరకంట అతని కళ్లలోకి చూసింది... ఆ కళ్లు, తను రోజూ చూసే

మదనగోపాలస్వామి కళ్లులా తోచాయి... ఏదో చెప్పాలనీ, మరెన్నో అడగాలనీ ఆమె మనసు ఆరాటం చేసింది... ఎలా చెప్పాలో తెలియక ఇబ్బంది పడింది...

పక్కనే ఉన్న రావిచెట్టు ఆకుల మధ్య నించి తెరలుతెరలుగా చల్లగాలులు వీస్తున్నాయి... చెట్టుపైకి చేరుకున్న పక్షులు ఒకటే రొద చేస్తున్నాయి... అంతవరకూ మబ్బుల చాటుగా ప్రయాణం చేస్తున్న శుక్ల పక్ష చంద్రుడు... వాటిని తప్పించుకుని బయటకొచ్చి, ఆ పరిసరాలకు 'వెన్నెల వెల్ల' పూస్తున్నాడు... ఆ వాతావరణం రాధకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది...! అంతలోనే, "ఇంక బయల్దేరదాం" అంటూ వేణూ లేచాడు... ఆమె అతన్ని అనుసరించింది...!

ఆ రాత్రి మావయ్యతో కూర్చుని భోజనం చేస్తున్నాడు... సుందరమ్మ వాళ్ల పక్కనే కూర్చుని వడ్డన చేస్తూ, హైదరాబాదు విశేషాలు అడుగుతోంది... వేణు ఓపిగ్గా ఆమెకు జవాబు చెప్తున్నాడు...

అంతలో బలరామయ్య అన్నాడు...

"నీకు పిల్లనిస్తానంటూ... భీమవరం నించి మొన్నీమధ్య నా స్నేహితుడొకడు వచ్చాడు... పిల్లని నేను ఇదివరకు చూశాను... చాలా బావుంటుంది... డిగ్రీ చేసింది... అన్ని విధాలా మంచి సంబంధం... కట్నం కూడా బాగానే ఇచ్చేలా ఉన్నాడు... ఎలాగా నువ్వు ఉద్యోగస్థుడివయ్యావ్... ఓ ఇంటివాడివి కూడా అయితే, పై నున్న మీ అమ్మా, నాన్నా సంతోషిస్తారు... నీకు అభ్యంతరం లేకపోతే, పొద్దున్నే వెళ్లి పిల్లని చూసొద్దాం!"

"మరి రాధ పెళ్లి మాటేమిటీ?' వెంటనే అడిగేడు వేణు.

"చూద్దాం! దానికింకా కళ్యాణ ఘడియరాలేదు... ఏం చేస్తాం?... అయినా నీకు తెలుసుగా... ఇప్పటికి  ఆరేడు సంబంధాలు  తీసుకొచ్చేను... కొంతమంది పిల్లను చూడకుండానే, 'వద్ద'న్నారు... ఇంకొంతమంది లక్షల్లో కట్నాలు కావాలన్నారు... దాని చదువు సంధ్యల్నీ, తెలివి తేటల్నీ ఎవరూ చూడటంలేదు...!" నిట్టూర్చాడు బలరామయ్య...

"నేను చూస్తూనే ఉన్నాను... నాకిచ్చి చెయ్యొచ్చు కదా!" వెంటనే అన్నాడు వేణు.

బలరామయ్య ఉలిక్కి పడ్డాడు... గొంతులో ఉన్న అన్నంముద్ద క్రిందకు దిగలేదు కాబోలు, గట్టిగా పొలమారింది... వడ్డన చేస్తున్న సుందరమ్మ చేష్టలుడిగిన దానిలా చూసింది...

"నేను మీకు నచ్చలేదా?" అడిగాడు వేణు.

"నీకేంరా? మేలిమి బంగారానివి... చదువూ సంస్కారం వున్న వాడివి... కానీ..." ఇంకా ఏదో చెప్పబోయాడు బలరామయ్య.

"మేనరికం చేస్తే, పుట్టేపిల్లలకు అవకరాలూ, అవయవలోపాలూ వస్తాయని భయమా?" ఈ సారి బలరామయ్య వైపు సూటిగా చూస్తూ అడిగేడు వేణు...

"అదీ నిజమే కదా!... డాక్టర్లు కూడా ఆ మాటే చెప్తున్నారు!" కల్పించుకుంది సుందరమ్మ.

"నేనూ కాదనటం లేదత్తయ్యా!... అయినా వరుసగా పిల్లల్ని కంటూ పోతే, వాళ్లల్లో ఎవరికైనా, ఎక్కడైనా అలాంటి లోపాలు వస్తే రావచ్చు... ఒకే బిడ్డతో సరిపెట్టుకుంటే ఆ సమస్య రాదని నా నమ్మకం!... ఇపుడు వైద్య విజ్ఞానం చాలా మెరుగైంది... బిడ్డ సక్రమంగా, ఆరోగ్యంగా పుట్టేందుకు, కడుపున పడ్డప్పటినించే వైద్యాలు చేస్తున్నారు... పైగా కట్నం తీసుకోవటం నేరమవుతుంది కానీ, మేనరికం చేసుకోటం నేరం కాదుగా!"

అంతవరకూ మేనల్లుడికి తన కూతుర్నిచ్చి చెయ్యాలన్న ఆలోచన రాకపోయినా, తనకు తానుగా వేణు ముందుకొచ్చి రాధను తనకిచ్చి చేయమని అడగటంతో బలరామయ్యలో కూడా ఆ కొత్త కోరిక చిగురు తొడిగింది...

"నాకు రాధంటే మొదట్నించే చాలా ఇష్టం మావయ్యా...! తనకూ నేనంటే ఇష్టమే ననుకుంటున్నాను...నీ చలవ వల్ల నేనిప్పుడు ఓ స్థాయికి చేరుకున్నాను కనుకనే ధైర్యం చేసి మనసులో మాట చెప్తున్నాను... రాధ చిన్నప్పటినించే తెలుసు... నేను తప్ప తనను మరెవరూ నా అంత బాగా అర్థం చేసుకోలేరని కూడా నాకు తెలుసు! అంతేకాదు తను నాకు తోడుగా వుంటే, నేను అనాథననే సంగతి ఇక ఈ జీవితంలో గుర్తుకురాదు... బాగా ఆలోచించి, రాధను కూడా ఓ మాట అడిగి, ఇష్టమైతే త్వరలో ముహూర్తాలు పెట్టించు!" భోజనం ముగించి లేచాక చెప్పాడు వేణు...

తర్వాత మూడునెలలకే రాధా వేణూలు దంపతులయ్యారు!... తమ కూతుర్ని వేణూ చేతికి అప్పగించి బరువెక్కిన మనసులతో హైదరాబాదు పంపించారు బలరామయ్య దంపతులు!...

★ ★ ★

"రాధా!" ఏడాది క్రితం నాటి గతాన్ని తలబోసుకుంటూ మరో లోకంలో ఉండిపోయిన రాధ, స్నేహితురాలు తన భుజం మీద చేయివేసి కుదుపుతూ పిలవటంతో, వాస్తవానికొచ్చింది రాధ.

"ఏమిటిలా బొమ్మలా కూర్చుండిపోయావ్?... పొద్దెక్కుతోంది... తొందరగా ఇంటికి పద... మీ అమ్మా నాన్నా నీ కోసం ఎదురు చూస్తుంటారు!" స్నేహితురాలి హెచ్చరికతో, మండపంలోంచి లేచి ఆమెతో ఇంటికి నడిచింది రాధ.

బలరామయ్య దంపతులు, కూతురు ముచ్చట్లు తెలుసుకుంటూ, మూడు నెలల కాలాన్ని మూడు రోజులుగా గడిపేశారు!... ఓ రోజు నిద్రలేస్తూనే నొప్పులొస్తున్నాయని ఆరాటపడింది రాధ... పక్కనే టౌన్లో ఉన్న 'లేడీ డాక్టరు'కి ఫోన్ చేసి పిలిపించాడు బలరామయ్య...

రాధ మగబిడ్డను ప్రసవించింది... ఆఫీసుకి రెండు రోజులు శలవుపెట్టి హైదరాబాదు నించి వేణూ వచ్చాడు... తన వారసుణ్ణి చూసుకుని మురిసిపోయాడు.

"ఈ ముక్కూ, నోరూ, నుదురూ అన్నీ అచ్చు గుద్దినట్టు నీ పోలికలే వీడికి వచ్చాయి రాధీ!... చాలా అదృష్టవంతుడవుతాడు!" అంటూ ఆ పసిబిడ్డ బుగ్గల్ని ఆప్యాయంగా తాకేడు వేణు. ఆ చేతిని రాధ తన చేతిలోకి తీసుకుని, అరచేతిలో ముద్దు పెట్టుకుని, తర్వాత ఆ చేతిలో, తన చూపుడు వేలితో ఎప్పటిలా అక్షరాలు రాసింది...

"నీకు ఎలా కృతజ్ఞతలు తెలియచేయాలో తెలీటంలేదు బావా!... మూగతనాన్నే శాపంగా మోస్తూ గడిపిన నా జీవితానికి అర్థాన్నీ పరమార్థాన్నీ చేకూర్చావ్... అదేదో పాటలో, ఓ కవి చెప్పినట్లు, 'నిద్రించే నా జీవితపు తోటలోకి మధురమైన పాటను' తీసుకొచ్చావ్... ఇపుడు నన్ను తల్లిని చేసి, జన్మ చరితార్థం చేశావ్... మన బిడ్డకు నా 'పోలికలు' వచ్చాయే గానీ, నా 'మూగతనం' మాత్రం రాదట!... మొన్న లేడీడాక్టరు చెప్పింది... ఇక నించీ వీడి గొంతులో నీ మాటలే వినిపిస్తాయ్!"

ఆమె కనుకొలకుల నించి జారిపడుతున్న ఆనందబాష్పాల్ని, తన మునివేళ్లతో తుడిచి - "థ్యాంక్యూ రాధీ" అంటూ ఆమె నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు వేణు!!

*(నవ్య - వీక్లీ)*
*జూలై, 2011*

★ ★ ★